సాక్షి
అనకాపల్లి
శనివారం । 26 । అక్టోబర్ । 2024


తిమిరాం శారదానది ఒడ్డున తరలించేందుకు సిద్ధంగా ఉంచిన ఇసుక గుట్టలు

దోచేస్తున్నారు


భారీ లోతున ఇసుక తవ్వకాలు


తెనుగుపూడిలో వంతెనను ఆనుకొని ఇసుక తవ్వి ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్న దృశ్యం

తవ్వేస్తున్న నదీ గర్భాలు.. ప్రమాదపుటంచున వంతెనలు.. వాల్టా చట్టానికి తూట్లు.. ప్రజలకు పాట్లు.. అధికార మదంతో ఎలాంటి అక్రమాలకైనా సిద్ధపడుతున్నారు టీడీపీ నేతలు. వారి అడుగులకు మడుగులు ఒత్తుతున్నారు అధికారులు. అంతా కలిసి జనాన్ని నిలువు దోపిడీ చేస్తున్నారు. నిర్మాణం తలపెడితే చాలు జేబు గుల్లవుతోంది. మాకవరపాలెం మండలంలో సర్పానదిని దోచుకుంటున్న ఇసుకాసురులు..
దేవరాపల్లి మండలంలో శారదానది పరీవాహక గ్రామాలలో వంతెనల వద్ద ఇసుకను దొలిచేస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా సాగుతున్న ఈ వ్యవహారం అధికార దుర్వినియోగానికి నిలువెత్తు నిదర్శనం.


సర్పా నదీ తీరం నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

టీడీపీ నేతల కనుసన్నల్లో..

- దేవరాపల్లి మండలంలో అక్రమ ఇసుక ర్యాంప్‌లు
- పగలు, రాత్రి తేడా లేకుండా సరకు లూటీ
- శారద నదీ గర్భంలో అక్రమ తవ్వకాలు
- వాల్టా చట్టానికి తూట్లు
- వంతెనలకు పొంచి ఉన్న ప్రమాదం

దేవరాపల్లి: ఇసుక మాఫియా పేట్రేగిపోతుంది. శారదానది పరీవాహక గ్రామాలలో పచ్చ పార్టీ నేతలు అడ్డూ అదుపూ లేకుండా ఇసుక దోపిడీ చేస్తూ మనల్ని ఎవడ్రా అడ్డుకునేది అంటూ రెచ్చిపోతున్నారు. ఉచిత ఇసుక పాలసీ నిబంధనలు ప్రకటించక ముందే నదీ గర్భంలోకి ట్రాక్టర్లు, లారీలు తీసుకెళ్లి ఇష్టానుసారం ఇసుక తవ్వుతున్నారు. ప్రభుత్వం ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇవ్వాలంటే ముందుగా ఎక్కడెక్కడ ఎంత మేర ఇసుక నిల్వలు ఉన్నాయని మైన్స్ అధికార్లతో గుర్తించాల్సి ఉంటుంది. అప్పుడు మైన్స్ అధికారులు చెప్పిన చోట మాత్రమే ఇసుక తవ్వకాలు జరపాల్సి ఉంటుంది. అంతే తప్పా ఇష్టానుసారం తవ్వకాలు చేస్తే వాల్టా చట్టానికి తూట్లు పొడిచినట్లే. పచ్చ పార్టీకి చెందిన ఇసుకాసురులు మాత్రం ఇవేమీ తమకు పట్టవంటూ ఇష్టారాజ్యంగా రెచ్చిపోతున్నారు. మండలంలోని తెనుగుపూడి, వెంకటరాజుపురం, తిమిరాం, కలిగొట్ల, బోయలకింతాడ, వేచలం, మారేపల్లి, తారువ, తామరబ్బ, సమ్మెద గ్రామాలలో అనధికార ఇసుక ర్యాంప్‌లు నిర్వహిస్తున్నారు. ఇసుకను విశాఖతో పాటు విజయనగరం జిల్లా వేపాడ, కొత్తవలస మండలాల తరలిస్తూ లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. దేవరాపల్లి మండలం నుంచి రోజుకు సుమారు వంద ట్రాక్టర్లు, లారీల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. కలిగొట్ల, తిమిరాం, వేచలం గ్రామాలలో పగటి పూట ఇసుకను గుట్టలుగా ఏర్పాటు చేసి రాత్రి పూట లారీల్లో తరలిస్తుండగా తెనుగుపూడి, విస్సారపు వీధిలో పట్టపగలే ట్రాక్టర్లతో దర్జాగా ఇసుక దోపిడీ చేస్తున్నారు. అక్రమ తవ్వకాలతో కోట్లాది రూపాయలతో నిర్మించిన వంతెనలకు ముప్పు పొంచి ఉంది. భారీ గోతులు చేసి మరీ తవ్వకాలు చేపడుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రెవెన్యూ, పోలీస్, మీడియా పేరిట మామూళ్లు వసూలు

శారదానదిలో స్థానికులు ట్రాక్టర్‌తో ఇసుక వ్యాపారం చేసేందుకు నెలకు మండల పరిధిలో రూ.10 వేలు, మండల బోర్డర్ దాటి తరలిస్తే రూ.15 వేలు చెల్లించాలని ఇసుక మాఫియా రేట్ ఫిక్స్ చేసింది. ఈ సొమ్మును రెవెన్యూ, పోలీస్ అధికార్లకు, కొందరు మీడియా ప్రతినిధులకు చెల్లించాలని మాఫియా బాహాటంగా చెప్పడం ఇక్కడి పరిస్థితికి అద్దం పడుతుంది. ఇదే విషయమై ఇద్దరు ట్రాక్టర్ల యజమానులు మాట్లాడిన సంభాషణ సోషల్ మీడియాలో చక్కెర్లు కొడుతోంది. అందుకు తగ్గట్టుగానే పట్టపగలే భారీ స్థాయిలో ఇసుక దోపిడీ చేస్తున్నా పోలీస్, రెవెన్యూ అధికారులు అటుగా కన్నెత్తి చూడకపోవడం విమర్శలపాలవుతోంది. పోలీసులు ఒకటి రెండు చోట్ల ట్రాక్టర్లను పట్టుకోవడం తప్ప అనధికార ఇసుక ర్యాంప్‌ల వైపు దృష్టి సారించకపోవడంపై పలు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. పట్టుకున్న కొన్ని వాహనాలను సైతం కేసులు నమోదు చేయకుండా విడిచిపెట్టడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. బోయిలకింతాడలో ఇసుక లోడుతో లారీని పట్టుకొని పోలీసులకు అప్పగిస్తే కేసు నమోదు చేయకుండా విడిచి పెట్టడం ఇందుకు నిదర్శనం.

ఇసుక తవ్వకాలకు అనుమతి లేదు

ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని ప్రకటించింది కాని నిబంధనలను విడుదల చేయలేదు. అందుకే అధికారికంగా మేము ఇసుక తవ్వకాలకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. అనధికారిక ఇసుక తరలింపుపై ఎలా స్పందించాలో మాకు స్పష్టత లేదు. ప్రభుత్వం నుండి ఉచిత ఇసుక పాలసీకి సంబంధించిన నిబంధనలకు వచ్చాక అందుకు అనుగుణంగా చర్యలు చేపడతాం.

– పి. లక్ష్మీదేవి, తహసీల్దార్, దేవరాపల్లి

జంగాలపల్లిలో యథేచ్ఛగా..

- రూ.కోట్ల విలువైన సరకు తరలించేందుకు రూ.3 లక్షలతో రోడ్డు ఏర్పాటు
- ఇసుక తవ్వకాలతో సమీప భూములకు ముప్పంటున్న రైతులు
- ఎనిమిదెకరాల ప్రభుత్వ భూమిలో ఇసుక మేటలు

మాకవరపాలెం: ప్రభుత్వ భూమిలో ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. రెండు రోజులుగా పగలు రాత్రి తేడాలేకుండా ఇసుకను తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని జంగాలపల్లి సర్పానదిని ఆనుకొని సుమారు ఎనిమిది ఎకరాల ప్రభుత్వ భూమిలో నాణ్యతగల ఇసుక నిల్వలు ఉన్నాయి. 30 ఏళ్ల కిత్రం తుపాను వర్షాలకు నదీ ప్రవాహంలో కొట్టుకు వచ్చిన ఇసుక సుమారు 20 అడుగుల లోతున మేటలు వేసింది. ఏటి బాడవగా (ప్రభుత్వ భూమి) పిలిచే ఈ భూమిని స్థానికులు కొందరు ఆక్రమించుకున్నారు. ఈ భూమి మాదంటూ వంతులుగా పంచేసుకున్నారు. సర్పానదిని ఆనుకుని నిల్వలున్న ఈ ఇసుక మేటలను ఆక్రమణదారులు 20, 30, 50 సెంట్ల చొప్పున అమ్మకాలు చేశారు. ఇలా ఎకరా మేటలను రూ.20 లక్షల నుంచి 30 లక్షలకు అమ్మకాలు చేసినట్టు స్థానికులు చెబుతున్నారు. గతంలో ఇక్కడి నుంచి ఇసుకను తరలించగా స్థానికులు అడ్డుకోవడంతో నిలిపివేశారు. ఉచిత ఇసుక అంటూ ప్రచారం సాగడంతో రెండు రోజులుగా మళ్లీ ఇసుకను తవ్వి దర్జాగా తరలిస్తున్నారు.

రూ.3 లక్షలతో రోడ్డు నిర్మాణం

ఈ ఇసుక మేటల తరలింపునకు అనువుగా మాఫియా పటిష్టమైన రోడ్డును ఏర్పాటు చేసింది. సర్పానది అవతల ఉన్న ఈ భూముల వరకు మూడు రెండు రోజుల క్రితం రోడ్డును నిర్మించారు. నదిలో నుంచే రోడ్డును వేయడంతోపాటు నీటి ప్రవాహం అధికమైతే ఇబ్బంది లేకుండా ఉండేందుకు నాలుగు సిమెంట్ తూరలను కూడా సిద్ధం చేశారు. ఇసుక తరలింపునకు అడ్డంకులు లేకుండా రోడ్డు నిర్మాణానికే రూ.లక్షల్లో ఖర్చు చేశారంటే ఇక్కడ ఏ స్థాయిలో ఇసుక నిల్వలు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

తవ్వకాలతో సమీప రైతుల ఆందోళన..

ప్రస్తుతం ఇసుక తవ్వకాలు జరిగే ప్రాంతంలో సర్పానది మలుపు తిరిగి ప్రవహిస్తుంది. గతంలో భారీ వర్షాలకు పక్కనే ఉన్న భూములను ముంచెత్తిందని, ఆ సమయంలోనే ఇక్కడ ఇసుక మేటలు వేసిందని రైతులు చెబుతున్నారు. ఇప్పుడు జరుగుతున్న తవ్వకాలతో మళ్లీ భారీ వర్షాల సమయంలో నది తమ భూములను ముంచి వేస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. భవిష్యత్తులో సాగు, తాగునీటికి కూడా ఇబ్బందులు తప్పవని అంటున్నారు. భారీ వర్షాల సమయంలో తమ భూములు కోతకు గురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూమిలో ఇసుకను అమ్మేసుకున్నా.. ఇక్కడ తవ్వకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.


ఇసుక తరలింపునకు సర్పానదిలో వేసిన రోడ్డు

ఫిర్యాదు వస్తే విచారణ చేస్తాం

ఇసుక తవ్వకాల వల్ల జిరాయితీ భూముల రైతులకు ఇబ్బందులుంటే ఫిర్యాదు చేయొచ్చు. ఆ ఫిర్యాదులపై విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూముల్లో ఇసుక మేటలు అమ్మకాలు చేయడం నిబంధనలకు విరుద్ధం. అలాంటి వాటిపై చర్యలు ఉంటాయి.

– రామారావు, ఇన్‌చార్జ్ తహసీల్దార్, మాకవరపాలెం

అక్రమార్కులకు అడ్డుకట్ట

- గబ్బాడ డిపో నుంచి రాత్రి వేళ ఇసుక తరలింపు
- అడ్డుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు
- వాహనాలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

నర్సీపట్నం: గబ్బాడ డిపోలోని ఇసుకను అక్రమంగా భారీ వాహనాల్లో తరలిస్తుండగా వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డుకున్నారు. 40 టన్నుల సామర్థ్యం కలిగిన రెండు టిప్పర్లలో శుక్రవారం రాత్రి ఇసుకను తరలించేందుకు సిద్ధపడగా.. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తన అనుచరులను పంపించారు. వారు హుటాహుటిన గబ్బాడ ఇసుక డిపోకు చేరుకోగా.. ఆ సమయంలో అక్కడ ఉన్న టీడీపీ నాయకులు, మైనింగ్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది నెమ్మదిగా నిష్క్రమించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డుకోవడంతో ఇసుక తరలింపునకు బ్రేక్ పడింది. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు మీడియాతో మాట్లాడుతూ.. డిపోలోని ఇసుకను రాత్రి సమయంలో తరలించి టీడీపీ నాయకులు, అధికారులు సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. డిపో మూసి ఉండాల్సిన సమయంలో ఇసుక అక్రమ రవాణాకు ప్రోత్సహించిన మైనింగ్, రెవెన్యూ, టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిబంధనలకు విరుద్ధంగా..

ప్రభుత్వ నిబంధనల మేరకు డిపోలో సాయంత్రం 5 గంటలు దాటిన తరువాత ఇసుక సరఫరా నిలిపివేయాల్సి ఉంది. కానీ గబ్బాడ ఇసుక డిపోలో శుక్రవారం రాత్రి 7 గంటలకు రెండు టిప్పర్లతో ఇసుక లోడు చేస్తుండగా మున్సిపల్ వైస్‌చైర్మన్ కోనేటి రామకృష్ణ, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, లీగల్ సెల్ విభాగం నాయకులు మాకిరెడ్డి బుల్లిదొర మరి కొంతమంది నాయకులతో రాత్రి వేళ ఇసుక డిపోకు చేరుకున్నారు. వీరిని చూసి ఇసుకను అన్‌లోడ్ చేసి, నెమ్మదిగా జారుకోవడానికి ప్రయత్నించగా వారు టిప్పర్లను కదలనివ్వలేదు. డిపోలో ఉన్న మైనింగ్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది అక్కడ నుంచి పరారయ్యారు. విషయం బయటకు పొక్కడంతో రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ, ఎస్సై సిబ్బందితో డిపోకు చేరుకున్నారు. లారీలను పంపించేందుకు పోలీసులు సిద్ధపడగా అక్రమంగా ఇసుక తరలిచేందుకు వచ్చిన వాహనాలను పంపించడం సరికాదని వైఎస్సార్‌సీపీ నాయకులు సీఐకు సూచించారు. లారీల డ్రైవర్లను సీఐ ప్రశ్నించగా.. తాము ఇసుక లోడుకు అచ్యుతాపురం నుంచి వచ్చామని చెప్పారు. కానీ ఎక్కడకు తీసుకు వెళ్తున్నదీ చెప్పలేదు. లారీ తాళాలు స్వాధీనం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు పోలీసులను డిమాండ్ చేశారు.


గబ్బాడ ఇసుక యార్డులో రాత్రి పూట ఇసుక లోడింగ్


లారీ డ్రైవర్లను ప్రశ్నిస్తున్న పోలీసులు

ఉపాధ్యాయ ఓటర్ల నమోదుకు దరఖాస్తులు

తుమ్మపాల: ఉపాధ్యాయ ఓటర్ల నమోదుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉపాధ్యాయుల నియోజకవర్గ ఓటర్ల జాబితా తయారీకి గతంలో ఓటర్లుగా ఉన్న ఉపాధ్యాయులంతా వచ్చే నెల 6వ తేదీ నాటికి ఫారం–19 ద్వారా దరఖాస్తులు అందించాలని పేర్కొన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాను వచ్చేనెల 23న ప్రచురించనున్నట్టు తెలిపారు. ప్రధాన ఎన్నికల అధికారి వెబ్‌సైట్ www.ceoandhra.nic.in ద్వారా కూడా ఫారం –19 దరఖాస్తులను సమర్పించవచ్చన్నారు. ఫారం –19 దరఖాస్తు చేసుకునే ప్రతి వ్యక్తి అర్హత తేదీకి ఆరేళ్ల ముందు కనీసం మూడేళ్ల పాటు నిర్దిష్ట విద్యా సంస్థలో పని చేసినట్లు ధ్రువీకరణ పత్రం సమర్పించాలని పేర్కొన్నారు. రెవెన్యూ డివిజనల్ అధికారి, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

చోరీల నివారణకు ప్రత్యేక చర్యలు

- సొత్తు రికవరీ శాతాన్ని పెంచాలి
- పరవాడ ఏటీఎం చోరీ ఛేదనపై ప్రత్యేక దృష్టి
- సమీక్ష సమావేశంలో ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: జిల్లాలో చోరీలు అరికట్టేందుకు, సొత్తు రికవరీ శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశించారు. ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం జిల్లా సీసీఎస్ పోలీస్ సిబ్బందితో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పరవాడలో జరిగిన ఏటీఎం దొంగతనంలో నిందితులు వాడినట్లు అనుమానిస్తున్న వాహనం.. కేరళ రాష్ట్రం త్రిస్సూర్‌లో ఇదే రకమైన నేరంలో పట్టుబడిన నిందితుల వాహనంతో సరిపోలి ఉందన్నారు. దీంతో పీటీ వారెంట్‌పై నిందితుల్ని పరవాడ స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించాలన్నారు. పాత నేరస్తుల కలయికలపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని, నేటి వరకూ జరిగిన కేసుల్లో చోరీ సొత్తు రికవరీని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టంతో అనుమానాస్పద వ్యక్తుల వేలిముద్రలను తనిఖీ చేయాలన్నారు. జైలు నుంచి విడుదలైన నిందితుల కదలికలపై నిఘా కొనసాగించాలని సూచించారు. సరిహద్దు జిల్లాల పోలీస్ అధికారులతో మాట్లాడి నేరాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. క్యాంపులకు వెళ్లే వారు తమ ఇంటికి ఎల్‌హెచ్‌ఎంఎస్‌లు ఏర్పాటు చేసుకుంటే పోలీసులు పర్యవేక్షించేందుకు అవకాశం ఉంటుందన్నారు. బ్యాంకు లాకర్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలను పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు క్రైం ఎస్పీ ఎల్.మోహన్‌రావు, సీసీఎస్ ఎస్‌ఐలు రమేష్, సత్యనారాయణ, ప్రసాద్, ఫణిదాసు, తదితరులు పాల్గొన్నారు.


సీసీఎస్ పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

ఏయూలో డ్యూయల్ డిగ్రీ కోర్సులు

- బీటెక్ వీఎల్ఎస్ఐ, ఎం.టెక్‌లో సిగ్నల్ ప్రోసెసింగ్ కోర్సులు

మద్దిలపాలెం: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో డ్యూయల్ డిగ్రీ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు వీసీ ఆచార్య జి. శశిభూషణరావు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన వార్షిక బోర్డ్ ఆఫ్ స్టడీస్ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా డ్యూయల్ డిగ్రీ కోర్సులను ప్రతిపాదించామన్నారు. బీటెక్ వీఎల్ఎస్ఐ, ఎంటెక్ సిగ్నల్ ప్రోసెసింగ్ కోర్సులను ప్రారంభిస్తామన్నారు. 2018 నుంచి ఏయూలో చదివి అనివార్య కారణాల వలన మిడ్, ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కాలేని, పరీక్ష తప్పిన విద్యార్థుల కోసం రీ ఎగ్జామినేషన్స్ నిర్వహించాలని నిర్ణయించామన్నారు. సమాజ, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కోర్సుల్లో అవసరమైన మార్పులు చేయాలని సూచించారు. అనంతరం విభాగాలలో బీఓఎస్ సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎస్. కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ. ఎన్ ధనుంజయ రావు, అకడమిక్ డీన్ ఆచార్య కె. ఈశ్వర్ కుమార్, ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎ.నరసింహారావు, జి.గిరిజా శంకర్, కె.సీతా మాణిక్యం, ఆచార్య ఆర్.పద్మశ్రీ, ఆచార్య డి.నాగరాజ కుమారి తదితరులు పాల్గొన్నారు.



వార్షిక బోర్డు ఆఫ్ స్టడీస్ సమావేశంలో వీసీ ఆచార్య శశిభూషణరావు

వాతావరణం

అనకాపల్లి : రాగల నాలుగు రోజులు ఆకాశం మేఘావృతమై అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం చెప్పారు. ఈనెల 26న 3 మి.మీ, 27న 2, 28న 2, 29న 6, 30న 1 మి.మీ చొప్పున వర్షపాతం నమోదవుతుందన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో డాగ్ స్క్వాడ్ తనిఖీలు

నర్సీపట్నం: ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సీఐ గోవిందరావు ఆధ్వర్యంలో శుక్రవారం పోలీసులు నార్కోటిక్ డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికుల లగేజ్ బ్యాగ్‌లు, ఆర్టీసీ పార్శిళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గంజాయి, తదితర మత్తు పదార్థాల రవాణాను అరికట్టడానికి ఈ తనిఖీలు నిర్వహించామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతిచోట నిఘా పెంచామన్నారు. ఎవరికైనా గంజాయి గురించి సమాచారం ఉంటే వెంటనే తెలియజేయాలన్నారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ రమేష్, తదితరులు పాల్గొన్నారు.


డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

పశుగణన ప్రారంభం

- 4 నెలలపాటు పశువులు, జీవాలను లెక్కించే బృహత్తర కార్యక్రమం
- కార్యక్రమ వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్

తుమ్మపాల: జిల్లాలో 16 రకాల పశువులు, జీవాల సంఖ్యను లెక్కించేవిధంగా పశుగణన కార్యక్రమాన్ని నాలుగు నెలలపాటు నిర్వహించనున్నట్లు కలెక్టర్ విజయ కృష్ణన్ చెప్పారు. కలెక్టర్ కార్యాలయ చాంబర్‌లో శుక్రవారం పశుసంవర్థక శాఖ అధికారులతో జరిగిన సమావేశంలో పశుగణన వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించి గణన కిట్లను సిబ్బందికి అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 21వ జాతీయ పశుగణన ప్రక్రియ కింద ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూలు ప్రకారం ఈ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 24 గ్రామీణ మండలాలతోపాటు, పట్టణ ప్రాంతాల్లోనూ పశుగణన చేపడతామన్నారు. జిల్లాలోని ప్రతి ఇంటిని సందర్శించి, వాళ్ల పరిధిలోని గేదెలు, ఆవులు, కోళ్లు, గొర్రెలు, మేకలు వంటి జీవాలను లెక్కించి యాప్‌లో నమోదు చేయనున్నట్లు వివరించారు. ఈ నెల 25 నుంచి 2025 ఫిబ్రవరి 28 వరకు జరిగే ఈ పశుగణన కార్యక్రమం కోసం 294 మంది ఎన్యూమరేటర్లు, 59 మంది సూపర్‌వైజర్లను నియమించామన్నారు. గణనకర్తలకు (ఎన్యూమరేట్లకు) ప్రజలు సహకరించి కచ్చితమైన వివరాలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ బి.రామ్మోహనరావు పాల్గొన్నారు.


పశుగణన కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ జాహ్నవి

క్లుప్తంగా

4 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు



గంజాయితో పట్టుబడిన నిందితులతో ఎస్‌ఐ భీమరాజు, సిబ్బంది

నాతవరం : గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నామని నాతవరం ఎస్‌ఐ సిహెచ్.భీమరాజు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలో తాండవ జంక్షన్‌లో శుక్రవారం వాహనాలు తనిఖీలు చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు ఆర్‌టీసీ బస్సు దిగి సంచరిస్తుండగా అనుమానం వచ్చి బ్యాగ్‌లు తనిఖీలు చేశామన్నారు. వారి వద్ద గంజాయి లభించిందన్నారు. కృష్ణ జిల్లా గొల్లపూడి గ్రామానికి చెందిన గుర్ల రాజు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు గ్రామానికి చెందిన బానోజు వీరన్న, విజయవాడ రూరల్‌కు చెందిన పట్టెం సురేష్‌లను అదుపులోకి తీసుకొని స్టేషన్‌ను తరలించామన్నారు. వారి వద్ద 4 కిలోల గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

వాహనం ఢీకొట్టి గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పాయకరావుపేట: మండలంలో నామవరం గ్రామం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఏఎస్‌ఐ గోవిందరావు శుక్రవారం తెలిపారు. గురువారం అర్ధరాత్రి నక్కపల్లి నుంచి తుని వైపు ప్రయాణిస్తున్న వాహనం సదరు వ్యక్తిని ఢీ కొట్టడంతో తలకు, కాళ్లకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతుని వద్ద ఏవిధమైన గుర్తింపు పత్రాలు లభించలేదన్నారు. మృతదేహాన్ని నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డీఎస్సీ ఉచిత కోచింగ్ దరఖాస్తుకు గడువు పెంపు

విశాఖ విద్య: ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఉచిత డీఎస్సీ కోచింగ్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఆదివారం వరకు గడువు పొడిగించినట్లు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కే రామారావు తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో సకాలంలో దర ఖాస్తు చేసుకోవాలన్నారు. ఉచితంగా కోచింగ్ ఇవ్వడంతో పాటు, స్టైఫండ్ కూడా పొందే అవకాశం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన అభ్యర్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలు ప్రారంభం

గొలుగొండ: మండలంలోని ఏఎల్‌పురం జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయిలో అండర్ -14 బాలబాలికల వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 32 జట్లు పాల్గొన్నాయి. సర్పంచ్ లోచల సుజాత, హెచ్‌ఎం నాగభూషణం, ఎస్‌ఐ తారకేశ్వరరావు ఈ పోటీలను ప్రారంభించారు. ఇక్కడ పోటీల్లో ప్రతిభ చాటిన జట్లను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామని, బాలబాలికలకు అన్ని సౌకర్యాలు కల్పించామని హెచ్‌ఎం, జిల్లా స్థాయి ఫెడరేషన్ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు చింతల బుల్లిప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పోటీలు ప్రారంభిస్తున్న సర్పంచ్ సుజాత, హెచ్‌ఎం నాగభూషణం, పీఈటీలు

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఒమ్మలి విద్యార్థినులు

మాడుగుల రూరల్: మండలంలోని ఒమ్మలి జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. పదో తరగతికి చెందిన డి. గీతామాధురి అండర్ -17కు, 9వ తరగతికి చెందిన కె. సుప్రియా అండర్ -14 పోటీలకు ఎంపికయ్యా రని హెచ్‌ఎం కె. జగన్మోహన్ నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 19, 22 తేదీల్లో తుమ్మపాల, లంకెలపాలెం, హైస్కూళ్లలో జరిగిన జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో వీరు పాల్గొని ప్రతిభ కనబర్చారన్నారు. ఇరువురు విద్యార్థినులను ఫిజికల్ డైరెక్టర్ కె. వెంకట్రావు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్, సభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులు అభినందించారు.



ఎంపికైన విద్యార్థినులు గీతామాధురి, సుప్రియా

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికైన మౌనికకు సత్కారం

మునగపాక: క్రీడల్లో రాణించడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయని శ్రీ ధర్మ ఫౌండేషన్ చైర్మన్ కర్రి సాయికృష్ణ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుకుంటున్న ఆడారి మౌనిక రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికై న నేపథ్యంలో శుక్రవారం ఆమెను సత్కరించారు. సాయికృష్ణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమంది విద్యార్థులు నైపుణ్యం ప్రదర్శిస్తారని, వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. మౌనిక క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డాన్ జిమ్ అధినేత పెంటకోట విజయ్, గ్రామస్తులు విల్లూరి నూకనరసింగరావు, పెంటకోట శ్రీరామమూర్తి, హైస్కూల్ కమిటీ చైర్మన్ ఆడారి సూర్యచంద్ర రావు పాల్గొన్నారు.



మౌనికను అభినందిస్తున్న సాయికృష్ణ

29, 30 తేదీల్లో జిల్లా స్థాయి ఉద్యోగులకు ఎంపిక పోటీలు

తుమ్మపాల: ఈ నెల 29, 30 తేదీల్లో జిల్లా స్థాయి సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల(స్త్రీ, పురుషులు)కు 18 క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు జరగనున్నాయని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎల్. వి.రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియం, కలెక్టరు కార్యాలయం వద్ద గ్రౌండు, పట్టణంలో చిన్న హైస్కూల్, రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం, డి.సి.ఎం.స్ గ్రౌండ్, జార్జ్ క్లబ్‌లో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న జిల్లా స్థాయి అధికారుల కోసం నిర్వహించే ఈ పోటీల్లో ఎంపికైన వారు వచ్చే నెల 6 నుంచి 9వ తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీసెస్ పోటీల్లో పాల్గొంటారన్నారు. అక్కడ ఎంపికై న వారు అఖిల భారత సివిల్ సర్వీసెస్ క్రీడల పోటీల్లో పాల్గొంటారన్నారు. అర్హులైన ఉద్యోగులు తమ గుర్తింపు ధ్రువపత్రాలతో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి సమాచారం కోసం హ్యాండ్‌బాల్ కోచ్ పి.వి నాగేశ్వరరావు (7382841568), హాకీ కోచ్ జి. రాంబాబు (9885530819) సంప్రదించాలని తెలిపారు.

టెన్నికాయిట్ పోటీలకు బుచ్చింపేట విద్యార్థిని

రొలుగుంట: మండలంలో బుచ్చింపేట హైస్కూల్ విద్యార్థిని ద్రాక్షాయణి రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 24న అనకాపల్లిలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన రాష్ట్ర పోటీలకు ఎంపికై నట్లు పీడీ కొండలరావు తెలిపారు. విద్యార్థిని ప్రధానోపాధ్యాయుడు శేఖర్, పీడీ కొండలరావు శుక్రవారం అభినందించారు.



ద్రాక్షాయణిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

'నిరంతర్' సేవలకు పురస్కారం



కొమ్మోజు గణేష్

మునగపాక : మండలంలోని టి.సిరసపల్లికి చెందిన నిరంతర్ సేవా ఫౌండేషన్ చైర్మన్ కొమ్మోజు గణేష్ యంగ్ ఇండియన్ జాతీయ స్థాయి పురస్కారానికి ఎంపికయ్యాడు. గణేష్ ఫౌండేషన్ స్థాపించిన నాటి నుంచి వలంటీర్లు, రక్తదాతల సహకారంతో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో పలు అవగాహన సదస్సులు నిర్వహిస్తూ వస్తున్నారు. చిన్న వయస్సులోనే గణేష్ రక్తదాన శిబిరాలు, కరోనా సమయంలో ఆహారం, ఉచిత మందుల పంపిణీ, ఉచిత ఆక్సిజన్ సిలిండర్ల అందజేత వంటి సేవలు నిర్వహించారు. వృద్ధాశ్రమాలకు అన్నదానం, వస్త్రదానం వంటి సేవలు అందిం చారు. యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ప్రతి ఏటా సామాజిక సేవలో ప్రతిభ కనపరిచిన వారికి అందిస్తున్న యంగ్ ఇండియన్ సేవా పురస్కారానికి గణేష్ ఎంపికయ్యారు. ఈ నెల 29వ తేదీన హైదరాబాద్‌లో పురస్కారం అందుకోనున్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ గ్రామ సభలు

జిల్లా ల్యాండ్ సర్వేయర్ మనీషా త్రిపాఠి



మాట్లాడుతున్న జిల్లా సర్వేయర్ మనీషా త్రిపాఠి

కశింకోట: భూ సమస్యలు పరిష్కరించడానికి రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నామని జిల్లా ల్యాండ్ సర్వేయర్ మనీషా త్రిపాఠి తెలిపారు. మండలంలోని ఏఎస్ పేటలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో ఆమె మాట్లాడారు. భూముల వివరాలలో తప్పులు పడితే సభ దృష్టికి తెస్తే పరిశీలించి సవరించడానికి చర్యలు చేపడతామన్నారు. అనంతరం తహసీల్దార్ ఎ.శ్రీనివాస రావు సమక్షంలో రైతుల నుంచి 81 అర్జీలను స్వీకరించారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, రీసర్వే డీటీ భాస్కర్ పాల్గొన్నారు.

హోంమంత్రి జిల్లాలో బాలికలపై లైంగిక దాడులు

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రమణ



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రమణ

అనకాపల్లి: హోంమంత్రి సొంత జిల్లాలో బాలికలపై లైంగిక దాడులు పెరిగిపోతున్నాయని, ఇది టీడీపీ అసమర్థత పాలనకు నిదర్శనమని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ విమర్శించారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎలమంచిలి మండలం లైన్ కొత్తూరు న్యూ లైఫ్ హాస్టల్లో తొమ్మిదో తరగతి విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిపై అక్కడ పోలీసులు పోక్సో కేసు నమోదు చేసినప్పటికీ పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి సకాలంలో శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాలికల వసతి గృహంలో బాలురకు వసతి కల్పించకూడదని, మరో ప్రాంతంలోకి మార్పు చేసేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 14న కేసు నమోదు అయినప్పటికీ ఇప్పటివరకు పోలీసుల విచారణలో పురోగతి లేకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా త్వరితగతిన విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కె .అర్జున్, ఎస్. ప్రసాద్, వి.నాగేష్ పాల్గొన్నారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో కేసు

అచ్యుతాపురం (మునగపాక) : అచ్యుతాపురం మండలం కుమారపురం గ్రామానికి చెందిన వ్యక్తిపై శుక్రవారం పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఈ నెల 19న కుమారపురానికి చెందిన మైనర్ బాలికతో అదే గ్రామానికి చెందిన రెడ్డి అశోక్ అసభ్యంగా ప్రవర్తించాడు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయం

- ఆ దిశగా రైతులకు అవగాహన
- జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు

అనకాపల్లి: నూతన సాంకేతికతో సమగ్ర వ్యవసాయ విధానాలపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు తెలిపారు. పట్టణంలోని గుండాల జంక్షన్ వద్ద సబ్ డివిజన్ కార్యాలయంలో జిల్లా వనరుల కేంద్రం, ఆర్‌వైకెవై, ఆత్మ ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రం సిబ్బందికి నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఆధునిక వ్యవసాయ విధానం, యాంత్రీకరణ అంశాలపై క్షేత్ర స్థాయిలో తెలియజేసి వ్యవసాయాభివృద్ధికి కృషి చేయాలన్నారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకుడు పి. శ్రీధర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన (నేషనల్ పెస్ట్ సర్వైలెంట్ సిస్టం) ఆప్‌ను రైతులందరూ వినియోగించుకోవాలన్నారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం కీటక శాస్త్రవేత్త డాక్టర్ సరిత మాట్లాడుతూ వరి పొలంలో తెగుళ్లు, పురుగులు ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. వరిలో పొడ తెగులు, ఆకుముడత నివారణకు హెక్సాకొనజోల్ అనే మందును రెండు మిల్లీలీటర్ల లీటరు నీటికి, ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. వరిలో బీపీటీ-5204 రకానికి సుడిదోమ ఉధృతి ఎక్కువగా ఉన్నందున లీటరు నీటికి 1.5 గ్రాముల ఎసిఫేట్ కలిపి పిచికారీ చేయాలన్నారు. వరి పంటకు ఎకరానికి 25 కేజీలు యూరియా, 15 కేజీలు పొటాస్ వినియోగించాలన్నారు. బ్యాక్టీరియా ఎండు (పండా ఆకు) తెగులు నివారణకు ప్లాంటోమైసిన్ 100 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు రామారావు, ఆయా మండల వ్యవసాయ అధికారులు, జిల్లా వనరుల కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి మోహన్‌రావు

వరిలో కంకినల్లి నివారణకు ప్రత్యేక చర్యలు

అనకాపల్లి: వాతావరణ పరిస్థితులకు వరిలో కంకినల్లి వచ్చే అవకాశం ఉన్నందున ప్రోఫెనోఫాన్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ సీహెచ్ ముకుందరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరిలో సుడిదోమ, పొడతెగులు ఆశించే అవకాశం ఉన్నందున అసిఫేట్ 1.5 గ్రాములు, ప్రోపికొనజోల్ 1 మి.లీ.లీటరు నీటిలో పిచికారి చేసి నివారించవచ్చన్నారు. వరిలో కాండం తొలిచే పురుగు, ఆకుముడత పురుగు ఆశించే అవకాశం ఉందని, నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ మందును 2 గ్రాములు లేదా అసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని, తల్లి పురుగు కనిపిస్తే ట్రైకోగ్రామా గుడ్డు పరాన్న జీవిని ఎకరాకు 20 వేల చొప్పున విడుదల చేయాలన్నారు. రసాయనిక మందులు కాకుండా జీవ నియంత్రణ చేసే రైతులు బేరియా బాసియాన(బిబి5ఎ)ను లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. అంకురం దశలో ఎకరాకు 25 కిలోల యూరియా 15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌పై పాటుగా తగినంత తేమ ఉన్న ఉప్పుగుల్లు వేసుకోవాలని సూచించారు. ఉలవ సాగుకు ఇది సరైన సమయం అన్నారు. ఖాళీ పొలాల్లో అధిక దిగుబడి నిచ్చే ఉలవ రకాలైన పీడీఎం-1, క్రీడ 1-18 ఆర్, ఏటీపీహెచ్‌జీ-11ను వెదజల్లే పద్ధతిలో 12-15 కిల్లోల వరుసలలో గొర్రుతో విత్తే పద్ధతిలో ఎకరాకు 8-10 కిలోలు చొప్పున వరుసల మధ్య 30 సెం.మీ. మొక్కల మధ్య 10 సెం.మీ దూరంలో విత్తుకోవాలన్నారు. ఖాళీ పొలాల్లో విత్తనం కోసం పండించే జనుము సాగు చేసుకోవచ్చన్నారు.

హిమాలయాల్లో సాహసం

హిమాలయ పర్వత శ్రేణులు అత్యంత శీతల వాతావరణానికే కాదు.. ఎన్నో ప్రతికూలతలకు నిలయం. అత్యంత కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అలాంటి మంచు కొండలకు వెళ్లడం అంత సులభం కాదు. ప్రకృతి విసిరే సవాళ్లను తట్టుకొని నిలబడాలంటే మానసిక స్థైర్యంతో పాటు శారీరక దృఢత్వం కూడా ఎంతో అవసరం. అలాంటి పర్వత శ్రేణుల్లో ట్రెక్కింగ్ చేస్తూ తమ సాహసాన్ని చాటుకుంది అమెరికాకు చెందిన 10 మంది భారతీయ సంతతి వైద్యుల బృందం. ఇందులో మన విశాఖ వాసి ఉన్నారు. ఈ బృందం 5,364 మీటర్ల (17, 598 అడుగులు) ఎత్తులో ఉన్న మౌంట్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్(ఈబీసీ) ట్రెక్కింగ్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. – సీతమ్మధార

- ఎవరెస్ట్ బేస్ క్యాంప్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసిన విశాఖ వాసి
- అమెరికాకు చెందిన భారత సంతతి వైద్యులతో కలిసి ట్రెక్కింగ్
- యూఎస్‌ఏలో ఆంకాలజిస్ట్‌గా సేవలందిస్తున్న వినయ్‌కుమార్



తల్లిదండ్రులు, సోదరుడితో డాక్టర్ వినయ్‌కుమార్

నక్కవానిపాలెం దరి కేఆర్‌ఎం కాలనీకి చెందిన డాక్టర్ వినయ్ కుమార్ అమెరికాలో ఆంకాలజిస్ట్. అమెరికాకు చెందిన 9 మంది భారతీయ సంతతి వైద్యుల బృందంతో కలిసి ఈ నెల 10వ తేదీన మౌంట్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌కు బయలుదేరారు. ఈ ట్రిప్‌లో ప్రకృతి సోయగాలను వీక్షించడంతో పాటు అనేక అనుభూతులు పొందామని వినయ్‌కుమార్ తెలిపారు. మౌంట్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్ పూర్తి చేసుకున్న ఆయన గురువారం విశాఖ వచ్చారు. శనివారం అమెరికా వెళ్తున్న వినయ్‌కుమార్ శుక్రవారం 'సాక్షి'తో తన 'ఎవరెస్ట్' యాత్ర అనుభవాలను పంచుకున్నారు.

ఎన్నో అనుభూతుల సమ్మేళనం

'5,364 మీటర్ల ఎత్తులో ఉన్న ఎవరెస్ట్ బేస్ క్యాంప్ చేరుకోవడానికి కఠినమైన మార్గంలో పయనించాం. ప్రతి రోజూ నాలుగు నుంచి ఎనిమిది గంటల పాటు హైకింగ్ చేస్తూ.. దూద్ కోసి నది ఒడ్డున అనేక కిలోమీటర్ల పాటు ట్రెక్కింగ్ కొనసాగించాం. మధ్యలో ఎత్తైన కాలి నడక వంతెనలు దాటుకుని.. సుందర దృశ్యాలను వీక్షిస్తూ ముందుకు సాగాం. ఈ క్రమంలో అనేక సవాళ్లను ఎదుర్కొన్నాం. ఈ యాత్రకు ముందు ఏడాది పాటు వివిధ ఎత్తుల్లో ఉన్న పర్వతాలపై శిక్షణ తీసుకున్నప్పటికీ.. ఈ ట్రెక్ మాత్రం ఊహించిన దాని కంటే చాలా సవాల్‌గా మారింది.' అని వినయ్‌కుమార్ వివరించారు.

ప్రకృతి అందాలకు ఫిదా

'ఎవరెస్ట్ బేస్ క్యాంప్ ట్రెక్కింగ్ ప్రకృతి మార్గమే కాదు.. అక్కడి సంస్కృతిని తెలుసుకునేందుకు మాకు అవకాశం దక్కింది. అక్కడి ప్రజల జీవన విధానాలను ప్రత్యక్షంగా చూశాం. దారిలో అద్భుతమైన హిమాలయ పర్వత సుందర మనోహర దృశ్యాలను చూసి పరవశించిపోయాం. అలా సముద్ర మట్టానికి 3,440 మీటర్ల ఎత్తులో ఉన్న నామ్చే బజార్‌కు చేరుకున్నాం. ఈ ట్రెక్ ఎంతో శ్రమతో కూడినదే అయినా చుట్టూ ఉన్న అద్భుత సహజ సౌందర్యం, బృందంలోని సహచరుల పరస్పర సహకారంతో యాత్రను ఎంతో ఆనందదాయకంగా సాగించాం. ఆ తర్వాత 4,410 మీటర్ల ఎత్తులో ఉన్న తెంగ్‌బోచేకు చేరుకున్నాం. ఇక్కడ నుంచి పర్వత శిఖరాలు దగ్గరగా కనిపించాయి.'అని డాక్టర్ వినయ్ తెలిపారు.

శ్రమంతా మర్చిపోయాం..

దాదాపు 4,500 మీటర్ల ఎత్తులో ఉంది. నత్తల వేగంతో ఎక్కాం. ట్రెక్కింగ్‌లో మా ఆఖరి స్టాప్.. 5,164 మీటర్ల ఎత్తులో ఉన్న గొరెక్‌షెప్ గ్రామం. అక్కడ ఆక్సిజన్ స్థాయిలు 51 శాతం మాత్రమే ఉన్నాయి. దాదాపు 17,000 అడుగుల వద్ద ఆక్సిజన్ కోసం పెద్ద పోరాటమే చేశాం. చివరగా 10వ రోజున ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌కు చేరుకోవడం గొప్పగా అనిపించింది. ఈ యాత్రలో మేం పడిన శ్రమ, భరించిన కష్టాలు.. అక్కడి ప్రకృతి అందాలను చూసి పొందిన అనుభూతుల్లో కొట్టుకుపోయాయనే చెప్పాలి. నా ఎవరెస్ట్ బేస్ క్యాంప్ విజయవంతం కావడంతో నా తల్లిదండ్రులు చాలా సంతోషించారు.' అని వినయ్‌కుమార్ ముగించారు. కాగా.. అతని తండ్రి రామచంద్రరావు ఏయూలో పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. తల్లి కమల ఏయూలో పీహెచ్‌డీ చేశారు. సోదరుడు వివేకానంద హైదరాబాద్‌లో జాబ్ చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా మందస మండలం రాజపురం(వీరగున్నమ్మపురం)నకు చెందిన వీరు విశాఖపట్నంలో స్థిరపడ్డారు.



ఎవరెస్ట్ శిఖరం అధిరోహించిన డాక్టర్ వినయ్‌కుమార్

90 మిలియన్ టన్నుల సరకు రవాణా లక్ష్యం

విశాఖ సిటీ: విశాఖ పోర్టు ఈ ఏడాది 90 మిలియన్ టన్నుల సరకు రవాణా చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుని దాని సాధన కోసం కృషి చేస్తున్నట్లు పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు తెలిపారు. విశాఖ పోర్టు అథారిటీ 91వ ఆవిర్భావ దినోత్సవాన్ని పోర్టు పరిపాలనా భవనంలోని సాంబమూర్తి ఆడిటోరియంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను ప్రారంభించిన చైర్మన్ మాట్లడుతూ పోర్టు గత ఆర్థిక సంవత్సరంలో 81.09 మిలియన్ మెట్రిక్ టన్నుల సరకు రవాణా చేసి నూతన రికార్డును నెలకొల్పిందని, దాన్ని అధిగమించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. పోర్టు సామాజిక బాధ్యతలో భాగంగా వినియోగిస్తున్న సీఎస్ఆర్ నిధులకు సంబంధించి విద్యా, ఆరోగ్య రంగాలకు చెందిన సంస్థలకు చెక్కులు అందించారు. శిక్షణను పూర్తిచేసుకున్న సిబ్బందికి ఐజీటీటీ సర్టిఫికెట్లు, పెన్షనర్లకు ఐడీ కార్డులు పంపిణీ చేశారు. అనంతరం పోర్టు పరిపాలనా భవనంలో ఆధునీకరించిన బోర్డు రూంను అంగముత్తు ప్రారంభించారు. దీనికి వైజాగ్‌పటంగా నామకరణం చేశారు. పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దూబె, చీఫ్ విజిలెన్స్ అధికారి పి.ఎస్.ఎల్. స్వామి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఐఐఎం నూతన అధ్యక్షుడిగా స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ బాగ్చి

ఉక్కునగరం: ది ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెటల్స్ (ఐఐఎం) విశాఖ చాప్టర్ నూతన అధ్యక్షుడిగా స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) అరుణ్ కాంతి బాగ్చి నియమితులయ్యారు. శుక్రవారం ఉక్కు పరిపాలన భవనంలో ఐఐఎం వార్షిక సాధారణ సమావేశం (ఏజీఎం) నిర్వహించారు. కమిటీ కార్యదర్శి లలన్ కుమార్ గత ఏడాది ఐఐఎం నిర్వహించిన కార్యక్రమాలను వివరించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని నియమించారు. ఉపాధ్యక్షులుగా ఏయూ మెటలర్జీ విభాగాధిపతి ప్రొఫెసర్ కె. శ్రీనివాసరావు, రాష్ట్ర ఎన్ఐటీ మెటలర్జీ విభాగాధిపతి డాక్టర్ రఫీ మొహమ్మద్, కార్యదర్శిగా స్టీల్ ప్లాంట్ ఆర్అండ్‌డి సెంటర్ డీజీఎం డాక్టర్ శివకుమార్ నియమితులయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా క్యూఏటీడీ విభాగం డీజీఎం డీర్ సింగ్, ఆర్ఎండీ విభాగం డీజీఎం ఎస్.వి.సి.బోస్, తొమ్మిది మంది కార్యవర్గ సభ్యులను నియమించారు.

క్లుప్తంగా

'సూపర్ సిక్స్' అమలు చేయాలని డిమాండ్

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో విఫలమైందని గవర కార్పొరేషన్ మాజీ డైరెక్టరు, వైఎస్సార్‌సీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి బొడ్డేడ శివ శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చి నాలుగు మాసాలైందని, ప్రతి ఇంటికి ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయలేదన్నారు. ఇప్పుడు దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని మరోసారి మోసానికి తెర తీశారన్నారు. చదువుకున్న ప్రతీ విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని చెప్పి నేటి వరకూ పైసా ఇవ్వలేదన్నారు.

గౌరీపరమేశ్వరుల ఉత్సవం నేడు

కశింకోట: జమాదులపాలెంలో శనివారం గౌరీపరమేశ్వరుల (గౌరమ్మ) ఉత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా గౌరమ్మ విగ్రహానికి ఉదయం నుంచి పూజలు నిర్వహించి సాయంత్రం అందంగా అలంకరించిన ట్రాక్టర్‌పై గ్రామంలో కోలాటాలు, నేల వేషాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాల మధ్య ఊరేగింపు చేస్తామన్నారు. అనంతరం జాతీయ రహదారి వద్ద చెరువులో నిమజ్జనం చేయనున్నామన్నారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

నేడు కుంచావారి గౌరీపరమేశ్వరుల నిలుపు మహోత్సవం

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు కుంచావారి గౌరీపరమేశ్వరుల నిలుపు మహోత్సవం శనివారం రాత్రి నిర్వహించనున్నట్లు ఆలయ ప్రతినిధి అబ్బులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అమ్మవారిని పట్టణ పుర వీధుల్లో శని, ఆదివారాలు ఊరేగించి, సోమవారం వేకువజామున ఆలయంలో నిలుపుతున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా మరిడిమాంబ విగ్రహ ప్రతిష్ఠాపన

కశింకోట: మోసయ్యపేటలో మరిడిమాంబ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దుద్దేటి శ్రీను ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించి వేదమంత్రాల నడుమ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. భక్తులు ఎక్కువ సంఖ్యలో దర్శించుకున్నారు. రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు, బీసీ సాధికారత సమితి కన్వీనర్ సురేష్, టీడీపీ మండలాధ్యక్షుడు కాయల మురళీధర్, జనసేన నాయకుడు దొడ్డి నాగేశ్వరరావు, కర్రి వెంకట సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 892 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,590	5,700
మొదటి రకం	3,900	4,890
రెండో రకం	3,660	4,510
మూడోరకం	3,350	3,450

అనకాపల్లి సినిమాలు

దేవర	:రాజా
విశ్వం	:సత్యనారాయణ స్క్రీన్-1
వీణం 3డి 2	:సత్యనారాయణ స్క్రీన్-2
జనక అయితే గనక	: పర్తిసాయి
వేట్టయాన్	: షిర్డీసాయి
నరుడి బతుకు నటన	: వెంకటేశ్వర
ఎంత పనిచేసావ్ చంటి	:శ్రీసత్య
పాట్నేల్	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 26 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-18 యూనిట్లు, ఓ పాజిటివ్-4 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 349 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 314 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (ఫోన్ నంబర్ 08924 223595)ని సంప్రదించవచ్చు.

పంటల బీమా ప్రీమియంలో కిరికిరి

- కూటమి ప్రభుత్వంలో ఉచిత పంట బీమా ఎత్తివేత
- రబీ నుంచి వ్యవసాయ రుణం నుంచి వసూలు
- రుణాలు రెన్యువల్ చేసుకున్న వారికే వర్తింపు
- పథకాన్ని రైతులకు దూరం చేయడమేనని ఆగ్రహం
- గత వైఎస్సార్‌సీపీ హయాంలో ఉచితంగా అమలు

రైతులు భయపడినట్టే అయింది. గత వైఎస్సార్‌సీపీ హయాంలో పంటల బీమా ప్రీమియం ఉచితం కాగా, దీన్ని ఎత్తివేస్తూ చంద్రబాబు సర్కారు వారిపైనే భారం మోపేందుకు సిద్ధమైంది. ఇక నుంచి పంట రుణాలు తీసుకున్న సమయంలో ప్రీమియం వసూలు చేయనుంది. అంటే పంటల బీమా కావాలంటే కచ్చితంగా బ్యాంకు రుణం చెల్లించాలి. లేదంటే రెన్యువల్ చేసుకోవాలి. ఈ రెండు చేయకపోతే పంటల బీమా పథకం వర్తించదు. ఈ విధమైన కొర్రీలతో పథకానికి రైతులను దూరం చేయడమేనని సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది.



వరిపంట

తుమ్మపాల: మొదటి నుంచి వ్యవసాయమంటే పండగ కాదు దండగా అనే విధంగా వ్యవహరించే చంద్రబాబు ఇప్పుడు కూడా అదే వైఖరి అవలంబిస్తున్నారు. రైతాంగం దివాలా తీసేలా తన పాత విధానాలను అమలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం విధానాల మాదిరిగానే వాతావరణం కూడా ఈ ఏడాది ఖరీఫ్ నుంచి రైతులకు కష్టాలను తీసుకొచ్చింది. వరదలు, తుఫాన్‌లతో సతమతమవుతున్న వారికి మరో చెడు వార్త వినిపించింది. గత ప్రభుత్వం పంటలకు ఉచిత బీమా ప్రీమియం అందిస్తే, ఈ ప్రభుత్వం అదనంగా భారం మోపేందుకు సిద్ధమైంది.

• వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బీమా ఉచితం

2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదు సంవత్సరాల పాటు పంటలకు రైతుల తరఫున ప్రీమియం చెల్లించి ఆదుకుంది. దీనికి తోడు పెట్టుబడి సాయం కింద రైతుల ఖాతాల్లో ఏటా రూ.13,500 జమ చేస్తూ వచ్చింది. ఇటీవల కూటమి సర్కార్ రాష్ట్రంలో కొలువుదీరడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రైతులకు రూ.20 వేలు అందజేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా ఆ ఊసే ఎత్తడం లేదు. ఖరీఫ్ సాగుకు రెండు నెలల ముందే సర్కారు కొలువుదీరడంతో పథకాన్ని అమలు చేస్తారని, పంటల సాగుకు ఎటువంటి ఇబ్బంది ఉండదని ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతన్నల ఆశలు అడియాసలయ్యాయి. కనీసం రబీ సీజన్ సమయాని కన్నా ఇస్తారేమో అనుకుంటే అదీ లేకుండా చేశారు. దీంతో ఉసూరుమన్న రైతన్నలు సాగులో పెట్టుబడుల కోసం అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

• బీమా ప్రీమియం చెల్లింపులో మెలిక

కూటమి అధికారంలోకి రాగానే ప్రస్తుత ఖరీఫ్‌కు మాత్రమే ఉచిత బీమా అమలు చేసింది. వచ్చే రబీ నుంచి 2019 ముందు నాటి పంటల బీమా విధానమే అమలు చేసి రైతులను ఇబ్బంది పెట్టేందుకు సిద్ధమైంది. ఇక నుంచి పంటల రుణాలు తీసుకునే సమయంలో బీమా ప్రీమియం మొత్తాన్ని బ్యాంకులు మినహాయించుకుంటాయి. రైతులు అంగీకారం తెలియజేయకుంటే ఆ మొత్తం వెనక్కి వస్తుంది. అయితే ఇక్కడ అనుకోని కారణాలతో రుణాలు చెల్లించలేకపోతే పంటల బీమా ప్రయోజనం పొందలేరు. ఒక వేళ ప్రకృతి వైపరీత్యాల వల్ల

పంట	రైతు చెల్లించాల్సిన ప్రీమియం (హెక్టార్లలో)	చివరి తేదీ
వరి	రూ.1,575	31.12.2024
మొక్కజొన్న	రూ.1,313	15.12.2024
వేరుశనగ	రూ.1,200	15.12.2024
చెరకు	రూ.1,510	15.12.2024
జీడి	రూ.1,535	15.11.2024

నష్టపోయిన పంటలకు పరిహారం రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుంది. ఈ మొత్తంలో వ్యవసాయ రుణం మినహాయించుకుని మిగిలినది రైతులకు బ్యాంకులు ఇస్తాయి. అసలే అప్పులు చేసి సాగు చేస్తున్న ఇప్పుడు రుణాలను రెన్యువల్ ఎలా చేయగలమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో ఇటువంటి పరిస్థితి లేదు. వ్యవసాయ రుణాలతో సంబంధం లేకుండా ఐదేళ్లపాటు ఏటా ఉచితంగా పంటల బీమా అమలు చేసింది. తాజాగా ప్రీమియం చెల్లింపునకు డిసెంబర్ 15 తుది గడువు విధించింది. రుణాలు తీసుకోని రైతులు గ్రామ సచివాలయాలు, ఉమ్మడి సేవా కేంద్రాలు ద్వారా ప్రీమియం చెల్లించవచ్చని, జాతీయ పంటల బీమా పోర్టల్‌లో నమోదు చేయాలి.

ప్రీమియం చెల్లింపు అదనపు భారం



గత వైఎస్సార్‌సీపీ పాలనలో ఐదేళ్లుగా సాగుకు ముందు పెట్టుబడి నిధి అందింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ సహాయం అందకుండా పోయింది. దీంతో అప్పులు చేసి సాగు చేపట్టాం. బీమా ప్రీమియం గత ప్రభుత్వమే చెల్లించగా, ఈ ప్రభుత్వం రైతులనే కట్టమనడం భావ్యం కాదు. అసలే ఇబ్బందుల్లో ఉన్న రైతులకు ఇది అదనపు భారంగా మారనుంది.

– దాసరి గోపాలరావు, రైతు

అన్నదాత సుఖీభవ' ఎప్పుడో?



అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఏటా రైతన్నలకు రూ.20 వేలు అందజేస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా ఇంతవరకూ పథకం ఊసేలేదు. హామీల ఆశ జూపి అధికారంలోకి రావడం, వచ్చాక వాటిని అమలు చేయకుండా కాలాన్ని నెట్టుకురావడం టీడీపీకి అలవాటుగా మారింది.

– సిహెచ్.నాగేష్, రైతు

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బొట్టా చిన్నయాదవ్

అనకాపల్లి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించడంతో విఫలమైందని, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బొట్టా చిన్నయాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ. 2,100 కోట్లు, వసతి దీవెన కింద రూ.1,400 కోట్లు బకాయిలు ఉన్నాయని, వీటిని తక్షణమే విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలో దాదాపు 9.5 లక్షల మంది విద్యార్థులు అన్ని విభాగాల్లో విద్యనభ్యసిస్తున్నారని, కొన్ని విద్యా సంస్థల యాజమాన్యాలు ఫీజు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని చెప్పడంతో వారు భయభ్రాంతులకు గురవుతున్నట్లు వాపోయారు. తల్లిదండ్రులు ఫీజులు కట్టలేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యా శాఖ మంత్రి బకాయి ఫీజులు విడుదల ఎప్పుడు చేస్తారో చెప్పాలని కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల పాలకవర్గం

తుమ్మపాల: ఇటీవల జరిగిన జిల్లా స్థాయి ఆటల పోటీల్లో ఏఎంఏఎ హైస్కూల్ విద్యార్థులు గెలుపొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం కె.లావణ్య, వ్యాయామ ఉపాధ్యాయులు కె.మణికుమారి, పి.శివ తెలిపారు. విద్యార్థులు సమ్మింగ భవ్య కబడ్డీ, బి.శివ, బి.భాస్కర్ పి.నరేంద్రస్ హిరణ్యవర్ధ ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబరిచారన్నారు. వీరిని కళాశాల అధ్యక్ష, కరస్పాండెంట్‌లు కర్నాటకపు నారాయణరావు, కొణతాల శివకుమార్, వర్తక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కొణతాల లక్ష్మీనారాయణ, తమ్మున రఘుబాబు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

చంద్రబాబుకు రూ.కోట్ల ఆస్తి ఎలా వచ్చింది?

అనకాపల్లి: శవ రాజకీయాలు చేసే సీఎం చంద్రబాబునాయుడుకు ఇప్పుడు రూ.కోట్ల ఆస్తి ఎలా వచ్చిందని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజులు రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాజకీయాల్లోకి రాక ముందు ఆస్తి ఎంత, ప్రస్తుతం ఎన్నిరెట్లు పెరిగిందో రాష్ట్ర ప్రజలకు తెలుసన్నారు. ముఖ్యమంత్రి పీఠం కోసం మామ ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచారన్నారు. మామ ఆస్తులను స్వాహా చేశారని దుయ్యబట్టారు. 40 సంవత్సరాల రాజకీయ చరిత్ర కలిగిన చంద్రబాబు సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను నేటి వరకూ అమలు చేయలేదని ధ్వజమెత్తారు. పథకాలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడమే కాకుండా తిరుపతి లడ్డూలో కల్తీ జరిగిందని తప్పుదోవ పట్టించారని, ఫలితంగా సుప్రీం కోర్టుతో మొట్టికాయలు తిన్నారని విమర్శించారు.

కన్నూరుపాలెం రోడ్డులో దుమ్ము, ధూళి





కన్నూరుపాలెం వద్ద రోడ్డుపై రేగుతున్న దుమ్ము, ధూళి

వాహన చోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు

కశింకోట: మండలంలోని కన్నూరుపాలెంలో రోడ్డుపై దుమ్ము, ధూళి విపరీతంగా రేగుతుండటంతో ప్రజలు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాళ్లపాలెం నుంచి నర్సీపట్నం వైపు వెళ్లే మార్గంలో కన్నూరుపాలెం గ్రామం వద్ద వర్షాలు, భారీ వాహనాల తాకిడికి రోడ్డు దెబ్బతిని గతుకులు పడింది. దీంతో ప్రైవేటు పరిశ్రమ సహకారంతో గతుకులు తాత్కాలికంగా ఇటీవల పూడ్చారు. అయితే కాస్త రోడ్డు మెరుగుపడినప్పటికీ దానిపై ఉన్న బుగ్గి, బూడిద, ధూళి వాహనాల వేగానికి రేగిపోతోంది. వాహన చోదకులు, ప్రజల మీద విపరీతంగా పడుతుండటంతో ఇబ్బంది పడుతున్నారు. చుట్టు పక్కల ఉన్న దుకాణదారులు, నివాసితుల వారు దీని బారిన పడి ఇక్కట్లు తప్పడం లేదని వాపోతున్నారు. వెల్లువలా రాకపోకలు సాగిస్తున్న వాహనాల వల్ల నిరంతరంగా దుమ్ము, ధూళి వస్తుండటం వల్ల భరించలేకపోతున్నామని, దీన్ని పీల్చడం వల్ల శ్వాస కోశ సంబంధిత వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీని దృష్ట్యా శాశ్వత ప్రాతిపదికన రోడ్డుకు మరమ్మతులు చేపట్టి పునర్నిర్మించాలని, ఇందుకు రోడ్లు, భవనాల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

డ్రగ్స్ నివారణపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాలక్ష్మి

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ యువజన విభాగం, క్రీడా బోర్డు ఆధ్వర్యంలో జాతీయ సేవా సమితి(ఎన్‌ఎస్‌ఎస్) వలంటీర్లకు, విద్యార్థులకు మత్తు పదార్థాల నివారణపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి మాట్లాడుతూ మత్తు పదార్థాల తయారీకి దోహదపడే వృక్షాలు, వాటి పెంపకం, పర్యవసానాలపై విద్యార్థులకు వివరించారు. నెహ్రూ యువ కేంద్రం విభాగం నుంచి వచ్చిన ఆర్.లీలాప్రసాద్ రెడ్డి విద్యార్థుల్లో చైతన్యం తీసుకొచ్చేలా మాట్లాడారు. మత్తు పదార్థాల జోలికి విద్యార్థులు వెళ్లకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి, అలాంటి వారిని గుర్తించడమెలా? తదితర అంశాలను వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ బి.శంకర్, అధ్యాపకులు గోవిందరావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ గణేష్ పాల్గొన్నారు.

గొబ్బూరుపాలెంలో రెవెన్యూ గ్రామసభ

కశింకోట: గొబ్బూరుపాలెంలో శనివారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు తెలిపారు. రీ సర్వేలో లోపాలు, ఇతర భూ సమస్యలుంటే, వాటిని సభ దృష్టికి తెచ్చి అర్జీలను ఆధారాలతో అందజేయాలన్నారు. వీటిని పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

బాల్య వివాహాలపై సమాచారం ఇవ్వండి

అనకాపల్లి: బాల్య వివాహం ఎక్కడైన జరిగినట్లయితే దగ్గరలో అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ సచివాలయం, పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని 6వ సచివాలయం మహిళా సంరక్ష కార్యదర్శి ఇ.అనురాధ తెలిపారు. శుక్రవారం స్థానిక మెయిన్‌రోడ్డు పెద్ద హైస్కూల్, కళాశాల ఆవరణలో సీడ్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చిన్న వయసులో వివాహం చేయడం వల్ల బాలికలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. ఇటీవలలో సైబర్ నేరాలు పెరిగాయని, ప్రతి విద్యార్థి అప్రమత్తంగా ఉండాలని కోరారు.

అభిజిత్ పరిశ్రమ కార్మికుల నిరసన



జోగారావుపేటలో నిరసన తెలుపుతున్న అభిజిత్ పరిశ్రమ కార్మికులు

కశింకోట: అభిజిత్ పరిశ్రమను తక్షణమే తెరిపించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం జోగారావుపేటలో కార్మికులు నిరసన తెలిపారు. అచ్యుతాపురం సెజ్‌లోని అభిజిత్ పరిశ్రమను యాజమాన్యం లే ఆఫ్‌తో మూసివేయడం వల్ల జీవనాధారం లేక త మ కుటుంబాలు వీధిన పడుతున్నాయని వాపోయారు. సత్వరమే పరిశ్రమను తెరిపించడానికి అధికారులు చర్యలు చేపట్టాలని ఇక్కడి కార్మికులు డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా నాయకుడు దా కారపు శ్రీనివాసరావు, కార్మికులు ఎం.సన్యాసిరా వు, జె.శ్రీనివాసరావు, జె.పుష్పవతి, ఎం. భూలక్ష్మి పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో దేవదాయ కమిషనర్

సింహాచలం: సింహగిరికి వచ్చిన దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ సతీసమేతంగా ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ప్రసాదాన్ని, జ్ఞాపికను, శేషవస్త్రాన్ని అందజేశారు.

రసాయన వ్యర్థాలతో మొల్లేటిగెడ్డలో దుర్గంధం



మొల్లేటి గెడ్డలో నిలిచిన రసాయన వ్యర్థాలు

పరవాడ: భర్నికం సమీపంలోని మొల్లేటి గెడ్డ రసాయన వ్యర్థాలతో నిండిపోవడం వలన రైతులతో పాటు రహదారి ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫార్మా పరిశ్రమల యాజమాన్యాలు ఇష్టానుసారంగా విడుదల చేస్తున్న రసాయన వ్యర్థ జలాలు మొల్లేటిగెడ్డలో వచ్చి చేరుతున్నాయి. దీంతో సమీపంలోని పొలాల్లో వేసిన పంటలు నాశనమవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రసాయ వ్యర్థాలతో భూగర్భ జలాలు కూడా కలుషితమవుతున్నాయని ఆరోపిస్తున్నారు. గెడ్డలో నిలిచిన రసాయన వ్యర్థాలు భరించలేని దుర్వాసన వెదజల్లడంతో ప్రజలు తరచూ అనారోగ్యానికి గురువుతున్నారని స్థానికులు చెప్తున్నారు. ఈ ఇబ్బందుల్ని గుర్తించి, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు గెడ్డలో రసాయ వ్యర్థాలు విడుదల చేయకుండా ఫార్మా సంస్థల్ని నియంత్రించాలని కోరుతున్నారు.

జాతీయ స్థాయి బృందగాన పోటీలకు పయనం



బృందగాన పోటీలకు ఎంపికైన విద్యార్థులు

అనకాపల్లి: సికింద్రాబాద్‌లో ఈ నెల 27న నిర్వహించనున్న భారత వికాస్ పరిషత్ జాతీయ స్థాయి బృందగాన పోటీలకు స్థానిక డీఏవీ పాఠశాలల విద్యార్థులు శుక్రవారం బయలు దేరారు. రాష్ట్ర స్థాయి పరిషత్ బృందగాన పోటీలు ఈ నెల 20న రాజమహేంద్రవరంలో నిర్వహించారని పరిషత్ జిల్లా పూర్వపు అధ్యక్షుడు ఎ.ఓం. రాము తెలిపారు. విశాఖ, అమరావతి, తిరుపతి, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక సౌత్, కర్నాటక నార్త్, కేరళ ప్రాంత పోటీల్లో గెలుపొందిన వారికి జాతీయ పోటీలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి పరిషత్ అధ్యక్షుడు ఎన్. ఎ.బి.వర్మ, కార్యదర్శి డి.శివరాము, కోశాధికారి జి.లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు బుద్ధ అప్పారావు, ప్రాంత కన్వీనర్ ఎస్.గోపాలరావు, ప్రిన్సిపాల్ మహాదేవ శాస్త్రి పాల్గొన్నారు.

పశు గణన కరపత్రాల ప్రదర్శన



కరపత్రాల ప్రదర్శిస్తున్న పశువైద్య సిబ్బంది

కశింకోట: అఖిల భారత పశు గణన కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించాలని నరసింగబిల్లి పశు వైద్యాధికారి చైతన్యమణి తెలిపారు. మండలంలోని నరసింగబిల్లి, చింతలపాలెం, నూతలగుంటపాలెం గ్రామాల్లో అఖిల భారత పశు గణన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రైతులకు కార్యక్రమం ప్రాధాన్యం గురించి వివరించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి ఆఖరు వరకు ఇంటింటికి వెళ్లి జీవాల వివరాలను నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంపై రూపొందించిన కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ ఆర్. రూపవతి, సహాయకుడు రఘువీర్, జెట్టపురెడ్డితుని సర్పంచ్ కోన అరుణ, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోన నాగేశ్వరరావు, చింతలపాలెం మాజీ సర్పంచ్ కర్రి దుర్గినాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘం ఎన్నికల నిర్వహణకు సన్నాహాలు

కశింకోట: ఏఎస్ పేట వద్ద శారదానదికి సంబంధించి నరసాపురం ఆనకట్ట సాగునీటి సంఘం ఎన్నికలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఆనకట్ట పరిధిలో పల్లపు సోమవరం, ఏఎస్ పేట, నరసింగబిల్లి, నూతలగుంటపాలెం, ఏనుగుతుని, అచ్యుతాపురం గ్రామాలతోపాటు యలమంచిలి మండల గ్రామాలున్నాయి. సుమారు 3200 ఎకరాల ఆయకట్టు ఉంది. సాగునీరు ప్రవహించే భూముల రైతులకు ఓటు హక్కు కల్పించనున్నారు. దీంతో రెవెన్యూ రికార్డుల ఆధారంగా ఆయా గ్రామాల్లో ఆయకట్టు రైతుల వివరాలు సేకరించి ఓటర్ల జాబితాలను సిద్ధం చేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు. యలమంచిలి జల వనరుల శాఖ పరిధిలో ఈ సంఘం ఉంది. దీంతో అక్కడి జలవనరుల శాఖ డీఈ వై.సాయి ప్రశాంతి పర్యవేక్షణలో ఓటర్ల జాబితాను ఈ నెలాఖరులోగా సిద్ధం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిబంధనల మేరకు వచ్చే నెల 24న సంఘం ఎన్నిక నిర్వహించనున్నట్లు అధికారిక సమాచారం.

మతిస్థిమితం లేని వృద్ధురాలు బంధువులకు అప్పగింత



తప్పిపోయిన రమణమ్మను బంధువులకు అప్పగిస్తున్న పెందుర్తి పోలీసులు

పెందుర్తి: ఇంటి నుంచి తప్పిపోయిన మతిస్థిమితం లేని ఓ వృద్ధురాలిని పెందుర్తి పోలీసులు బంధువులకు అప్పగించారు. వివరాలివి. వేపగుంట సమీపంలోని కృష్ణరాయపురం టీచర్స్ లేఅవుట్ ప్రాంతంలో ఓ వృద్ధురాలు వీధుల్లో తిరుగాడుతోంది. ఆమె గురించి స్థానికంగా నివాసం ఉంటున్న శ్రీనివాస్ అనే వ్యక్తి పెందుర్తి పోలీసులకు సమాచారం అందించాడు. దీనిపై సీఐ కె.వి. సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు బ్లూకోట్స్ పీసీ ఎం.గోవింద్ అక్కడికి వెళ్లి ఆమెను విచారించారు. ఆమె చెప్పిన వివరాల ప్రకారం గొల్ల కంచరపాలెం నివాసిగా గుర్తించి, కంచరపాలెం పోలీసులకు సమాచారం అందించారు. కంచరపాలెం పోలీసులు సదరు వృద్ధురాలి చిరునామా తెలుసుకుని విచారించగా ఆమెను రమణమ్మగా గుర్తించారు. అనంతరం రమణమ్మను మనవడు ప్రసాద్, మేనల్లుడు అజయ్‌లకు అప్పగించారు.